క్లుప్తంగా

వాడవాడలా శరన్నవరాత్ర ఉత్సవాలు


అన్నపూర్ణాదేవి అమ్మవారి అవతారంలో ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి


లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో ఆదివారపుపేట పార్వతి అమ్మవారు


రామచంద్రపురంలో మహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ

రాయవరం: వెదురుపాక, మాచవరం, సోమేశ్వరం, రాయవరం, లొల్ల, పసలపూడి, చెల్లూరు, వెంటూరు గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిళలు బుధవారం సామూహికంగా లలితా సహస్రనామార్చనలతో కుంకుమ పూజలు చేశారు. పలుచోట్ల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో మహిళలు మంటపాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

మహాలక్ష్మి నమోస్తుతే..

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తి పీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన జరిగాయి. మాణిక్యాంబా అమ్మవారు మహాలక్ష్మిగ భక్తులకు దర్శనమిచ్చారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో అన్నపూర్ణాదేవి అమ్మవారి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు అలరించారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకుడు బోండు బాల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.

మహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ

రామచంద్రపురం: పట్టణంలోని కొత్తూరు రోడ్డు జోడు తూముల వద్ద వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజున బుధవారం మహలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు.

అర్తమూరులో అభివృద్ధి పరుగులు

- రెండున్నరేళ్లలో రూ.2.2 కోట్ల పనులు
- నేడు ఎమ్మెల్సీ తోట ప్రారంభోత్సవాలు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలు

మండపేట: ఆధ్యాత్మికతకు నిలయమైన అర్తమూరులో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. ప్రస్తుత పాలకవర్గం వచ్చాక గత రెండున్నర సంవత్సరాల్లో దాదాపు రూ. 2.2 కోట్లు విలువైన పనులు జరుగగా, రూ.1.33 కోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పూర్తయిన అభివృద్ధి పనులకు గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

సొంత సొమ్ము వెచ్చించిన సర్పంచ్ దంపతులు

పంచాయతీ, ఎన్ఆర్ఈజీఎస్, మండల పరిషత్, వివిధ ప్రభుత్వ గ్రాంట్లతో రెండున్నర సంవత్సరాల్లో గ్రామంలో రూ.2.2 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయి. రూ.43.6 లక్షలతో సచివాలయ భవనం, రూ.27.5 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లీనిక్, గణపతినగర్ ప్రాంతంలో రూ.26.9 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణం, తాపేశ్వరం నుంచి అర్తమూరు మీదుగా రామవరం వరకు రూ.కోటితో బీటీ రోడ్డు, పంట కాలువల వద్ద రూ.7.5 లక్షలతో రేవుల నిర్మాణం చేశారు. సాయిబాబా ఆలయ సమీపంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాలును రూ.6 లక్షలతో అభివృద్ధి చేశారు. జమ్మిచెట్టు వద్ద రూ.లక్షతో కల్వర్టు నిర్మించారు. గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.6.25 లక్షలు మంజూరు కాగా సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు 10 శాతం విరాళంగా రూ.75 వేలు తమ సొంత సొమ్ము వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. నాడు నేడు పథకం కింద శ్రీసత్యభాస్కర జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.69 లక్షలు, గణపతి నగర్, ఎస్సీకాలనీలోని ఎంపీపీ పాఠశాలల్లో రూ.24 లక్షలతో పలు అభివృద్ధి పనులు జరుగతుండగా, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.40 లక్షలు మంజూరు కాగా గ్రామంలో పలుచోట్ల రోడ్లు, డ్రైన్ల పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ భవనాలు, ఇతర నిర్మాణాలను గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించనున్నట్టు మండల మాజీ ఉపాధ్యక్షుడు గొలుగూరి విజయభాస్కరరెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఆయన ఈఓ అనిల్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట సహకారంతో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించగలుగుతున్నామని తెలిపారు. పార్టీ నేత గొలుగూరి సందీప్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి లక్ష్యం



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో గ్రామాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం. గ్రామంలోని పలు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించగలిగాం. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యాచరణ చేస్తున్నాం.

– గొలుగూరి అన్నపూర్ణ, సర్పంచ్, అర్తమూరు

ఎన్నో ఏళ్లనాటి సమస్యను పరిష్కరించారు



మా వీధిలో రోడ్డు, డ్రైన్ సరిగా లేక ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడ్డాం. డ్రైన్‌లోని మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయి రాకపోకలు సాగించలేకపోయేవాళ్లం. పంచాయతీవారు ఇటీవల రోడ్డు, డ్రైన్ నిర్మించి మా సమస్యను పరిష్కరించారు.

– ద్వారంపూడి కనకలక్ష్మి, గణపతినగర్, అర్తమూరు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: కాజులూరు, కుయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ సబ్‌స్టేషన్, మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కాజులూరు సబ్‌స్టేషన్ పరిధిలోని తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి విద్యుత్‌లైన్లలోని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. కుయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దుగ్గుదుర్రు, కుయ్యేరు, రేగుబడవ, చింతల్లంక, ఉప్పుమిల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపోతుందన్నారు.

మంచి ప్రభుత్వానికి కృషి

కపిలేశ్వరపురం: రాష్ట్రంలో చంద్రబాబు అనుభవంతో మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. మండలంలోని అంగరలో బుధవారం నిర్వహించిన జనసైనికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు రూ.ఐదు లక్షలు, గాయాలపాలైన వారికి రూ.50వేలు చొప్పున చెక్కులను అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట


వెదురుమూడిలో లబ్ధిదారుకు కళ్లజోడు ఇస్తున్న అధికారులు

కె.గంగవరం: ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవర లక్ష్మి, సర్పంచ్ అనుసూరి సాయి అన్నారు. మండలంలోని శివల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

కపిలేశ్వరపురం: వెదురుమూడిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి 557 మందికి పరీక్షలు చేశారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కరుణేంద్రకుమారి, డాక్టర్ శ్రీదుర్గ, సర్పంచ్ చోడే రామలక్ష్మి, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు శిబిరంలో సేవలను పర్యవేక్షించారు. 281 మంది మహిళలు, 276 మంది పురుషులకు పరీక్షలు చేశారు. చిన్నారుల సమస్యలపై ఏడు, గర్భకోశ 15, గర్భిణి ఐదు, జనరల్ సర్జరీ 20, కంటి 86, ఎముక 30, ఈఎన్‌టీ ముగ్గురిని పరీక్షించారు. 11 మందికి క్లో పరీక్షలు చేశారు. ఎనిమిది మందికి మెరుగైన పరీక్షలు చేయించాలని, ముగ్గురికి ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. ఇద్దరికి కళ్లజోళ్లను ఉచితంగా ఇచ్చారు. డాక్టర్ సీహెచ్ రాకేష్ కృష్ణ చౌదరి, డాక్టర్ రమ్యలక్ష్మి, డాక్టర్ తరుణ్ వైద్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి సందర్శించారు.

మండపేట: మండలంలోని ఇప్పనపాడులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 390 మందికి వైద్య నిపుణులు వైద్యపరీక్షలు నిర్వహించారు. 89 మందికి కంటి పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణిలకు సామూహిక సీమంతాలు నిర్వహించి పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ కుంచే వీరమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, పార్టీ నాయకులు శ్రీనివాస్, చిన్ని గంగాధరం, మల్లిబాబు, జయబాబు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో మంత్రి వేణు తనయుడు నరేన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 503 మంది వైద్యులు గ్రామస్తులకు డాక్టర్లు ఎస్.ప్రశాంతి, సునీత, ఎస్ఆర్‌సీ మూర్తి, ప్రతాప్, కంటి వైద్య నిపుణుడు ధర్మవరపు కోటేశ్వరరావు వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించారు. సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ తాతపూడి ప్రసన్న విజయకుమార్, వైస్ ఎంపీపీ శాకా బాబీ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ పాల్గొన్నారు.

రాయవరం: చెల్లూరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచ్ పాలిక రాఘవ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఎంపీటీసీ వైట్ల అనంతలక్ష్మి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, వైఎస్సార్ సీపీ నేతలు పాలిక గోవిందు, నల్లమిల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



దొంగనోట్ల ముఠా అరెస్ట్

మండపేట: మండలంలోని తాపేశ్వరంలో నకిలీనోట్లు ముద్రించి చలామణీకి పాల్పడుతున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.35,200 విలువ చేసే 62 రూ.500 నోట్లు, 21 రూ.200 నోట్లతో పాటు కలర్ ఫొటో ప్రింటర్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాలు మేరకు.. రాజారత్న సెంటర్‌లో నకిలీ కరెన్సీ నోట్లు మారుస్తున్నట్టు అందిన సమాచారంతో సీఐ శ్రీధర్‌కుమార్, పట్టణ ఎస్ఐ ఎం.అశోక్ సిబ్బందితో కలిసి నిఘా ఉంచారు. పోలీసులను చూసి తాపేశ్వరానికి చెందిన వీరవెల్లి రామకృష్ణ, పిల్ల అచ్చారావు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకుని కరెన్సీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు బుధవారం తాపేశ్వరంలోని వాసు ఫొటో స్టూడియోపై దాడిచేసి అక్కడ నకిలీ కరెన్సీ తయారు చేస్తున్న బుడపనేటి శ్రీనివాస్, వెలగల రామారెడ్డి, పడాల మణికంఠరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నకిలీ కరెన్సీ నోట్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపర్చగా నిందితులకు కోర్టు రిమాండ్ విధించినట్టు సీఐ శ్రీధర్‌కుమార్ తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

గుడ్ మార్నింగ్‌లో మంత్రి వేణు


గుడ్‌మార్నింగ్‌లో ప్రజల నుంచి సమస్యలు వింటున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పట్టణ వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ పరిశుభ్రతగా ఉంచాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదేశించారు. గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా పురపాలక పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం మంత్రి వేణు పర్యటించారు. వార్డుల్లోని ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యంపై తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలపై పారిశుధ్య అధికారులు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డిలకు పలు సూచనలు చేశారు. ప్రజలను ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాల వివరాలను అడిగి వారి సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగారు. మంత్రి వేణు మాట్లాడుతూ త్వరలోనే పట్టణంలో పూర్తి స్థాయి డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం జరుగుతుందన్నారు. పరిపాలనలో ఎన్నో వ్యవస్థలున్నప్పటికీ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన పారదర్శక పాలన అందుతుందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు లబ్ధి చేకూరే విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను రూపొందించారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అవినీతి లేని పాలనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వేణు అన్నారు. ప్రతి ఇంటికీ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. స్థానికంగా ఉన్న ప్రజలు తమ సమస్యలను మంత్రికి విన్నవించారు. అందులో భాగంగా డ్రైనేజీ సమస్యలతో పాటు రోడ్డు సమస్య, విద్యుత్ లైట్లు, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను మంత్రి వేణు ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ కె శ్రీకాంత్‌రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్, ఏఈ ఎంవీ రమణ, కౌన్సిలర్ గాదే సీతామహాలక్ష్మి, వైసీపీ నేతలు కంచుమర్తి బాబూరావు, కోటి దుర్గారావు, కొండేపూడి సురేష్, దిగుమర్తి వీరబాబు, కలిదిండి శ్రీను, కుక్కల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం


మల్లవరంలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న చెల్లుబోయిన నరేన్

కె.గంగవరం: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి చెల్లుబోయిన వేణు తనయుడు చెల్లుబోయిన నరేన్ అన్నారు. మండలంలోని కూళ్ల పంచాయతీ శివారు మల్లవరం, తమ్మయ్యపాలెంలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణు పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి వివరించి పత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమ అందించాలనే ఉద్దేశంతో నవరత్నాలు ప్రవేశపెట్టిందని దానిలో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా మధ్యవర్తిత్వం లేకుండా అందిస్తుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఏ పథకం అందాలన్నా, సమస్య పరిష్కారం కావాలన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు, జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎవరి వద్దకు వెళ్లకుండా ఎవరి రికమండేషన్ లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. సమస్యలు ఉంటే ఆయా గ్రామ సచివాలయాల్లోని సిబ్బందికి చెప్పినా, ఆ కుటుంబ పరిధిలోని వలంటీర్ దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రతి పేదవాడి కుటుంబంలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని రానున్న కాలంలో ప్రతి ఒక్కరికీ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పెంకే గోవిందరాజు, సొసైటి అధ్యక్షుడు బాలాజీ, సచివాలయ మండల కన్వీనర్ తోకల శ్రీను, పలు గ్రామాలు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

